


పి-4పై గ్రామసభ

ప్రజాశక్తి-జీకేవీధి: మండలంలోని జర్రెల పంచాయతీలో కార్యదర్శి ఆధ్వర్యంలో పీ-4 గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదరికం లేని సమాజం కోసం పీ-4 కార్యక్రమం నిర్వహించిందన్నారు. జిరో పేదరికం సాధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు సెక్రటరీ శ్రీదేవి, అడపా విష్ణుమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు కొండలరావు, కూటమి నాయకులు పెసా సభ్యులు అశోక్ రాజారావు బుజ్జిబాబు బాబురావు రామచంద్రరావు మత్యరాజు రంగారావు వి.ఆర్.పి రాజేశ్వరి వార్డు మెంబర్ వెంకట రమణ, నూకలమ్మ, వైసిపి నేత స్వామినాధం పాల్గొన్నారు..



హాజరైన నాయకులు

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలి

- అంగన్వాడీ కార్యకర్తల ఆందోళనలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించే టెక్ హోమ్ రేషన్ నిబంధన, ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక మండల కేంద్రంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు, లబ్ధిదారులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతం మారుమూల గ్రామాల్లో సెల్ సిగ్నల్ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం అనంతరం సిడిపిఓకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు కె కొండమ్మ, పవిత్ర, సత్యవతి, రాధ, నీలమ్మ, సీతమ్మ, అంగన్వాడి కార్మికులు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద పేస్ యాప్‌లను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం సీడీపీఓ సువర్ణ కు మెమోరాండం సమర్పించారు. ఆదివాసీ గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి మాట్లాడుతూ, పేస్ యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విధానాలు గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు తీవ్ర భంగం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమం లో అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ '(సిఐటియు) పిలుపుమేర సిఐటియు మండల కార్యదర్శి కె శంకర్‌రావు ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యదర్శి ఎస్ ఈశ్వరి అధ్యక్షతన ఆందోళన చేశారు. వినతి పత్రాన్ని ఐసిడిఎస్ సిడిపిఓ కు అందజేశారు. అనంతరం అంగన్వాడి మండల కార్యదర్శి ఈశ్వరి మాట్లాడుతూ, పాత పద్ధతిలో సంతకం పెట్టించుకుని సరుకులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతి, సత్యవతి, భవాని, చిలకమ్మా తదితరులు పాల్గొన్నారు..

అరకులోయ రూరల్: ఫేస్ యాప్ విధానం రద్దు చేయాలని మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ ఐసిడిఎస్ పిఓ ను వినతి పత్రం అందజేశారు. అనంతరం అంగన్వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ, తమకు ఇచ్చిన ఫోన్లు పని చేయలేదని, నెట్ స్పీడ్ ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకులు డి నాగమ్మ, బాలింతలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.



చింతూరులో ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు

అడ్డతీగల : అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లకు ఫేస్‌యాప్ రద్దు చేయాలని స్థానిక మండల కేంద్రంలో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ప్రాజెక్టు అధ్యక్షురాలు జి.బేబీరాణి అధ్యక్షతన సోమవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సెక్టర్ లీడర్స్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

చింతూరు: మండలంలోని చట్టి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్, ఐద్వా మండల అధ్యక్షురాలు మడివి శ్రీదేవి హాజరయ్యారు. ఫేస్‌యాప్ రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జి సిడిపికి అందించారు.కార్యక్రమంలో అంగన్‌వాడి ప్రాజెక్ట్ కార్యదర్శి నూకరత్నం సెక్టర్ లీడర్లు పాల్గొన్నారు.



అరకులోయలో...

మారేడుమిల్లి: అంగన్‌వాడిల సమస్యలపై సిఐటియు జిల్లా నాయకురాలు నిర్మల కుమారి ఆధర్యంలో ఆందోళన నిర్వహించారు. సిడిపిఒ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల అంగన్‌వాడి నాయకులు ప్రసూన, బేబీ పాల్గొన్నారు...

రాజవొమ్మంగి: అంగన్వాడి కేంద్రాల్లో సెంటర్ నిర్వహణకు ఒక యాప్ మాత్రమే నిర్వహించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఐసిడిఎస్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకురాలు వెంకటలక్ష్మి, సిఐటియు నాయకులు రామరాజు పాల్గొన్నారు.



అడ్డతీగలలో...



డుంబ్రిగుడలో..

ప్రభుత్వం గుర్తించిన భూములు

పేదగిరిజనులకే దక్కాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అర్జున్‌దొర డిమాండ్

ప్రజాశక్తి - ఎటపాక: పోలవరం ముంపు భూములుగా ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం పొందిన భూస్వామ్యులు తిరిగి వాటిని రైతులకు కౌలుకు ఇస్తున్నారని ఆ భూములు పేద గిరిజనులకే దక్కాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున్‌దొర స్పష్టం చేశారు.సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు సదరు భూముల్లో జెండాలు పాతారు. 2007లో పోలవరం ప్రాజెక్టు ముంపు భూములుగా ప్రభుత్వం గుర్తించి లక్షా 15వేలు నష్టపరిహారం భూస్వాములు పొందారన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో అవి పోలవరం భూములుగా ఉన్నప్పటికీ గత 18 సంవత్సరాలుగా జమీందారులు పెత్తనం సాగిస్తున్నారన్నారు. వాటిని స్థానిక చిన్న,సన్నకారు రైతులకు కౌలుకు ఇస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. భూపోరాటానికి స్థానిక గిరిజన రైతులు కూడా మద్దతుగా నిలవాలని గిరిజన సంఘం నేతలు కోరారు. ప్రభుత్వభూములను కౌలుకి ఇస్తూ లక్షలు ఆర్జిస్తున్న భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఇరప అజయ్, నాయకులు సొందె రామారావు, సోయం వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం గుర్తించిన భూముల్లో జెండాలు పాతిన గిరిజన రైతులు

ఆసుపత్రిలో అన్నీ ఉన్నా ..అందని వైద్యం

వైద్యో నారాయణో హరి..అని ఆర్యోక్తి. కానీ ఇక్కడి ఏరియా ఆస్పత్రిలో వైద్యో నారాయణో.. 'ప్రాణాలు హరీ' అన్న చందంగా తయారైంది పరిస్థితి. మందులు ఉన్నాయి. వైద్యులూ ఉన్నారు.. సాంకేతిక పరికరాలూ అందుబాటులో ఉన్నాయి. అయినా వైద్యం అందడం లేదు.

- రంపచోడవరం ఏరియా హాస్పిటల్ దుస్థితిదీ..
- సమయానికి వైద్యం అందక గిరిజనుల అవస్థలు



సీలేరు పీహెచ్‌సిలో ఒక్క వెయిటింగ్ రూంతోనే ఇబ్బంది పడుతున్న రోగులు



రంపచోడవరం ఏరియా ఆసుపత్రి

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఏరియా ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులను పరీక్షించేందుకు అన్ని రకాల పరికరాలు, టెక్నీషియన్స్ కూడా అందుబాటులో ఉన్నారు. అయినా రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు మాత్రం అందడం లేదు. రోగులకు వైద్యం అందించడంలో వైద్యులు విఫలమవుతున్నారని దీని కారణంగా కొన్ని సమయాల్లో రోగుల ప్రాణాలు కూడా పోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల గుండెపోటు రావడంతో ఒక మహిళ రోహిణి కుటుంబీకులు రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా గుండెపోటుకు సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నప్పటికీ దానిని చేయడానికి వైద్యులు అందుబాటులో లేరని చెప్పి రోగిని రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయగా ఆమెను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్యం అందిస్తుండగా మృతి చెందారు. అదేవిధంగా జూలై 7వ తేదీన సరిగా వైద్యం అందక గర్భిణి కూడా మృతి చెందిందని పలు గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఏరియా ఆసుపత్రికి లోతట్టు ప్రాంతాల నుంచి వచ్చే రోగులను రాజమండ్రి కాకినాడ వంటి మైదాన ప్రాంతంలో ప్రభుత్వాసుపత్రులకు పంపించి ఇక్కడి వైద్యులు చేతులు దులుపుకుంటున్నారని ఎంతో వ్యయ ప్రయాసులకోర్చి మెరుగైన వైద్యశాల కోసం వస్తున్న రోగులను కనీసం వైద్యపరీక్షలు కూడా చేయకుండా కొన్ని సమయాల్లో రిఫర్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా గర్భిణులను కొద్దిపాటి రిస్క్‌లో ఉన్న ఇక్కడ వైద్యులు వెంటనే వారిని రిఫర్ చేసేస్తున్నారని రాజమండ్రి, కాకినాడ వెళ్లాలంటే సుమారు రెండు మూడు గంటలు సమయం పడుతోందని ఈ లోపు మధ్యలోనే కొన్నిసార్లు ప్రసవాలు అయి మహిళలు మృతి చెందిన సందర్భాలు కూడా ఉన్నాయని అయినా వైద్యులు మాత్రం తమకేమీ పట్టినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే ప్రమాదాలు జరిగి తీవ్ర గాయాలైన వారికి కూడా వైద్యం అందించకుండా ప్రథమ చికిత్స అందించి వారిని రిఫర్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గైనకాలజీ డాక్టర్, ఎనస్థిషియన్ మధ్య ఉన్న విభేదాల వల్లే రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు ఆపరేషన్లు నిర్వహించకుండా రిఫర్ చేస్తున్నారని సమాచారం.

అన్ని మందులూ అందుబాటులో ఉన్నాయి



రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో అన్ని వ్యాధులకు సంబంధించిన మందులు పూర్తి స్థాయిలో ఉన్నాయి. పాముకాటుకు, గుండెపోటుకు సంబంధించి తదితర వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే జనరల్‌మెడిసిన్, గైనకాలజీ డాక్టర్లు అందుబాటులో లేక గర్భిణులు, గుండెపోటుతో వచ్చిన రోగులను రాజమండ్రికి తరలించాల్సి వస్తోంది తప్ప ఇతర ఏ కారణం కాదు. మా సిబ్బంది నిర్లక్ష్యం ఏమీ లేదు. గైనకాలజిస్ట్ ఒక్కరే ఉండడం, వారి డ్యూటీ అయి వెళ్లిపోయిన తరువాత ఎవరైనా వస్తూ అటువంటప్పుడు మాత్రమే రాజమండ్రి తరలిస్తున్నాం. మ గైనకాలజిస్ట్‌ను నియమించాల్సి ఉంది.

- శేషారెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్

సీలేరు పిహెచ్‌సిలో ఒక్కటే వెయిటింగ్ రూం...

సీలేరు: సీలేరు పీహెచ్‌సిలో ఒక్కటే వెయిటింగ్ రూమ్ ఉండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వెయిటింగ్ రూమ్ ఒక్కటే ఉండడం వలన తల్లీ, పిల్లలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పిహెచ్‌సి పరిధిలో వెయిటింగ్‌రూమ్ నిర్మాణం కోసం నిధులు మంజూరు అయినప్పటికీ స్థలం మంజూరు కాక పనులు జరగలేదు. అధికారులు స్పందించి స్థలం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ పోస్టులను మినహాయించాలి

- 48 గంటల మహాధర్నాలో ఆదివాసీ నిరుద్యోగుల డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించి ఆదివాసి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఎ గేటు ఎదుట సోమవారం ఆదివాసి నిరుద్యోగులు 48 గంటల మహాధర్నా నిర్వహించారు. ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.ధర్మన్నపడాల్ తో కలసి ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మహాధర్నా శిబిరాన్ని ప్రారంభించారు. ఆదివాసి నిరుద్యోగుల సంఘం, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన 48 గంటల మహాధర్నా కార్యక్రమంలో సోమవారం పాడేరు ఏజెన్సీ నలుమూలల నుంచి ఆదివాసి యువత, నిరుద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మెగా డిఎస్సిలో ఏజెన్సీ పోస్టులను మినహాయించాలని, ఆదివాసి నిరుద్యోగుల కోసం ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని, జిఒ.3 రిజర్వేషన్ కి ప్రత్యామ్నాయంగా మరొక జిఒను తక్షణమే జారీ చేయాలని, గిరిజనుల ఉద్యోగాల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్.సత్యనారాయణ, ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ జిల్లా కో-కన్వీనర్ రాధాకృష్ణ, భాను, సిహెచ్ రావు, డిఎల్ఒ నాయకులు కె.కొత్తయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్, చిన్నారావు, మహిళా సంఘం నాయకురాలు హైమావతి, స్వరూప, డిఎస్సి అభ్యర్థులు ఎం.భవాని, వి.చిన్నతల్లి, కష్ణంపడాల్, శంకర్, రాజంనాయుడు, ప్రవీణ్, విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



హామీలను అమలు చేయాలి

అరకులో జరిగిన ఎన్నికల ప్రచార సభలో తాము అధికారంలోకి వస్తే జిఒ.3కి ప్రత్యామ్నాయంగా మరో జిఒ తీసుకువస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ అమలు జాప్యంతో గిరిజనులు ఉద్యోగాలు కోల్పోతున్నాం. ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చి గిరిజన నిరుద్యోగులకు మేలు చేయాలని వేడుకుంటున్నాం. ఆదివాసి ప్రాంత ఉద్యోగాలన్నీ ఆదివాసీలకే చెందేలా చట్టం చేయాలి.



ఎస్.సత్యనారాయణ
జిల్లా కన్వీనర్, ఆదివాసి నిరుద్యోగుల సంఘం

ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలి

ఆదివాసి ప్రాంత ఉద్యోగాలన్నీ ఆదివాసీలకే చెందేలా జిఒ.3కి ప్రత్యామ్నాయంగా మరో జిఒను జారీ చేసి, మెగా డిఎస్సిలోని ఆదివాసి ప్రాంత పోస్టులను మినహాయించి, ఆదివాసి ప్రత్యేక డిఎస్సి నోటిఫికేషన్ ఇవ్వాలి. 100 శాతం రిజర్వేషన్ కు ప్రభుత్వం చూపించే ప్రత్యామ్నాయనికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలను వేగవంతం చేయాలి. చట్టబద్ధత కల్పించాలి.



వి.చిన్నతల్లి
డిఎస్ అభ్యర్థి

జిఒ 3పై త్వరలోనే సానుకూల నిర్ణయం

జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



మాట్లాడుతున్న జిసిసి ఛైర్మన్ శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు: గిరిజనుల మనోభావాలకు అనుగుణంగా జీవో 3 పై తమ కూటమి ప్రభుత్వం త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుని ఆదివాసీలకు మేలు చేస్తుందని రాష్ట్ర జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జీవో నెంబర్ 3 పునరుద్ధరణ పై ఆదివాసీలు ఎటువంటి ఆందోళన చెంద వద్దని సూచించారు. కూటమి ప్రభుత్వంతోనే గిరిజనులకు మేలు జరుగుతుందని, గతంలో జీవో 275ను అమలు చేసిన టీడీపీ ప్రభుత్వం అప్పుడే ప్రత్యేకంగా గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన కోసం జిఓ నెంబర్.3 తీసుకొచ్చిందని, నాడు ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన చరిత్ర, టీడీపి ప్రభుత్వానిదని ఆయన ఉద్ఘాటించారు. వైసీపీ ప్రభుత్వం జీవో నెం.3 పై కనీసం సుప్రీంకోర్టుకి వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని, గిరిజనుల మనోభావాలను గౌరవిస్తూ తమ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం జీవో నెం.3 పై వర్క్ షాప్ నిర్వహించి గిరిజనుల మనో భావాలను గౌరవించిందని, రద్దు అయినా జిఓ నెం.3పై కూటమి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో బాకూరు సర్పంచ్ వెంకటరమణ రాజు, దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, అండిభ సర్పంచ్ తామర్ల సత్యనారాయణ, శోభకోట సర్పంచ్ పలాసి శశి భూషణం నాయుడు, క్లస్టర్ ఇంచార్జి త్రినాధ్ మాజీ సర్పంచ్ నరంజి ప్రసాద్,టీడీపీ నాయకులు బుక్క జగదీశ్, కిల్లో లైకోన్,రాజు తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌తో అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

వరదలు, విపత్కర పరిస్థితులపై మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - చింతూరు : వరదల కాలంలో ముంచుకొస్తున్న విపత్కర పరిస్థితులను ఏ విధంగా ఎదుర్కోవాలి అకస్మాత్తుగా ఆ సమయంలో హార్ట్‌ఎటాక్ వస్తే ఎలా కాపాడుకోవాలి అనే విషయాలపై ముంపు ప్రాంతాల గ్రామాల్లో ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ ఆధ్వర్యంలో సోమవారం చింతూరు శబరి రోడ్డు ప్రాంతంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రిషిప్రకాష్, అసిస్టెంట్ పిఒ జగన్నాధరావు, తహశీల్దార్ మొహమ్మద్ హుస్సేన్, ఎంపిడిఒ శ్రీనివాస్‌దొర పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డొంకరాయి ఎస్ఐ శివకుమార్

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - మోతుగూడెం : అల్లూరి సీతారామరాజు జిల్లా, వై రామవరం మండలంలో బొడ్డగండి పంచాయతీ డొంకరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డొంకరాయి ఎస్సై శివకుమార్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టంపై అవగాహన కలిగిస్తూ బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. శక్తి యాప్‌ను ఇన్‌స్టాలేషన్ చేసుకోవడం వల్ల పొందే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు ఉన్నత చదువులను చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని , తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ విశ్వ కోయ (గోండు) భాషా దినోత్సవం

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రపంచ విశ్వ కోయ(గోండు) భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బందపల్లి పంచాయతీ, పెద కోరుమిల్లిలో ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటి, సంయుక్తకార్యదర్శి మడకం వరప్రసాద్‌దొర ,సోషల్ మీడియా కార్యదర్శి చవలం శుభకృష్ణ దొర ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో పాటు మన కోయ భాష కూడా మొదటి స్థానంలో ఉందని, మనకు మన పూర్వీకులు అందించిన బాషా సంపదను కాపాడు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కోరుమిల్లి ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులు పొడియం పండు దొర, ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బందపల్లి గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి పాడేరు :- కేరళ మాజీ ముఖ్యమంత్రి సిపిఎం పూర్వ పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ వి.ఎస్. అచ్యుతానందన్ మరణించడం పట్ల సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించింది.ఈ సందర్భంగా కార్యాలయాలపై పార్టీ జెండాను అవనతం చేయాలని పార్టీ కమిటీలకు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది . ఈ సందర్భంగా అల్లూరి జిల్లా సిపిఎం ప్రధాన కార్యదర్శి అప్పలనరస అచ్యుతానందన్ సేవలను కొనియాడుతూ. ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడిగా అనేక పోరాటాల్లో కీలకమైన వ్యక్తిగా వ్యవహరించారని పేర్కొన్నారు. 17 సంవత్సరాలకే కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడిగా చేరారని. కామ్రేడ్ కృష్ణ పిళ్లై నాయకత్వంలో భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్మికులు, వ్యవసాయ కార్మికుల పోరాటాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించారన్నారు. కేరళ అసెంబ్లీకి 7 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన పాలనలో ప్రజలకు సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టారని కొనియాడారు. 8 దశాబ్దాల కమ్యూనిస్టు ఉద్యమంలో వి.ఎస్. అచ్యుతానందన్ కేరళ ఉద్యమానికి కీలకమైన మనిషిగా ప్రత్యక్షంగాపాల్గొన్న నాయకుడిగా ఉన్నారన్నారు. కేరళ రాజకీయాల్లో మంచి గుర్తింపు పొందారనానరు.

అరకు కాఫీకి మరింత ప్రోత్సాహం

ప్రజాశక్తి- అనంతగిరి: ప్రపంచ దేశాలకు పేరుగాంచిన అరకు కాఫీని మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు చేపట్టాయని కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సి ఎస్ ఆర్ .మురళీధర, కాఫీ బోర్డ్ అసిస్టెంట్ ఆఫీసర్ వి. రమేష్ లు పేర్కొన్నారు. ఈ మేరకు నూతనంగా కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్గా ఎన్నికైన శెట్టి. రాజును కోనపురం పంచాయతీ గ్రామం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ పంట దిగుబడి విస్తారంగా చేపట్టేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు.. గ్రామాలలో రైతులను గుర్తించి కాఫీ పంట దిగుబడి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. దిగుబడితోపాటు మార్కెటింగ్ ఎగుమతులు మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. కాఫీ సాగు మరింత విస్తరణకు గుర్తించేందుకు పంచాయతీ గ్రామాలలో రైతులతో నేరుగా సమావేశాలు ఏర్పాటు చేసి కమిటీలు నియమించడానికి సర్వేలు తీసుకుంటామన్నారు. కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్గా నూతనంగా ఎన్నికైన రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమకు గుర్తించి కాఫీ బోర్డులో సభ్యునిగా ఎన్నిక పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కళాశాలలో సమస్యలపై ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి:స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ర్యాలీ మూడు రోడ్లు కూడలి మీదుగా తహెసిల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది.సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ వీరభద్ర చారికి అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థుల సంఘం నేతలు బి.చంటి బి.మాధవరావు లు మాట్లాడుతూ, కళాశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వంటపాక, మరుగుదొడ్లు, పరహరి గోడ లేదన్నారు. హాస్టల్ వసతి భవనం పనులు పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గిరిజనులకు సాగు హక్కు కల్పించాలి

జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: భూ సాగు గిరిజనులకు, .మాజీ సైనికులకు మధ్య వివాదంలో ఉన్న భూములకు సర్వే నిర్వహించి సాగులో ఉన్న గిరిజనులకు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జెడ్పీటీసీ దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు సోమవారం కరకవలస గ్రామంలో సందర్శించి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు మాట్లాడుతూ, సాగులో ఉన్న తమ భూములకు నేటికీ పట్టాలు ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ షెడ్యూల్ రోంపల్లీ పంచాయితీ రెవెన్యూ సర్వే నెంబర్ 1 ఎ పరిధిలో కరకవలస గ్రామంలో తాతల కాలం నుండి గ్రామంలో నివాసముంటూ .45 సంవత్సరాల క్రితమే రెవెన్యూ రికార్డుల ప్రకారం ఏర్పడిన గ్రామంలో గిరిజనులు నివసిస్తున్నారన్నారు. 17 కుటుంబాలకు గాను 7 కుటుంబాలకు గిరిజనులు సాగులో ఉన్న భూములకు ఎల్.పి.సి లేండ్ పొజిషన్ సర్టిఫికెట్ ప్రభుత్వం జారీ చేసి ఉన్నారన్నారు. మిగిలిన 10 మంది కుటుంబాలు ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టాలు ఇవ్వలేదన్నారు. సర్వే నెంబర్ 1ఎ లో 360 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నప్పటికి అదే సర్వే నెంబర్లలలో గిరిజనులకు, మాజీ సైనికులకు వివాదాస్పదంగా ఉందని, రెవేన్యూ అధికారులు సర్వేలు చేసి



మాట్లాడుతూన్న జెడ్‌పిటిసి గంగరాజు

17 మంది గిరిజనుల కుటుంబాలకు సాగులో ఉన్న భూములకు సాగు హక్కు పత్రాలు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.దీనిపై జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో పంచాయితీ సర్పంచ్ కోటపర్తి.చిరంజీవి, గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు

కక్ష సాధింపుతో తొలగిస్తే సహించం

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

ప్రజాశక్తి- చింతపల్లి: కక్ష సాధింపుల్లో మధ్యాహ్న భోజన కార్మికులను తొలగిస్తే, చలో కలెక్టరేట్ నిర్వహిస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ హెచ్చరించారు, సోమవారం మధ్యాహ్న భోజనం కార్మికులు తహసిల్దార్‌కు, స్థానిక ఎంఈఓకు వినతి పత్రాలు ఇచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ. గ్రామస్థాయి నాయకులు, స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ వైస్ ఛైర్మన్‌లు మధ్యాహ్న భోజన నిర్వాహకులపై వ్యక్తిగత కక్షలతో రాజకీయ వేధింపులతో తీర్మానాలు చేసి తొలగించేందుకు చూస్తున్నారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అతి తక్కువ జీతాలు తీసుకొని పనిచేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇంట్లో ఉన్నా లేకపోయినా అప్పులు చేసి పిల్లలకు మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారని తెలిపారు. అయినా కొంతమంది గ్రామ స్థాయిలో పిల్లలు ఉంటేనే వంట చేయాలనే నిబంధన లేనప్పటికీ ఈ అంశాన్ని తీసుకొచ్చి తొలగించాలని ఉపాధ్యాయుల మీద ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులపై కక్ష సాధింపు చర్యలు విడనాడాలన్నారు.మండల స్థాయి విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే జిల్లావ్యాప్తంగా వంటలు బంద్ చేసి చలో కలెక్టరేట్ మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు చిరంజీవి. మధ్యాహ్న భోజన కార్మికులు సంఘం జిల్లా అధ్యక్షులు. పసుపులేటి లక్ష్మి, మండల అధ్యక్షులు. పద్మ. జ్యోతి. సింహాచలం, వెంకటరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో గీతం కోర్సులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతమ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఆర్కిటెక్చర్, మెడికల్, పారామెడికల్, ఫార్మశీ, నర్సింగ్, ఫిజియోథెరిపి వంటి వృత్తి విద్యాకోర్సులతో పాటు బిఎస్‌సి, ఎమ్మెస్సీ, బిఎ, బికామ్, ఎమ్ఎ వంటి కోర్సులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని, విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని గ్రీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు 'దీక్షారంభ్' పేరిట సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా కోర్సులలో మార్పులు చేస్తూ విద్యార్థుల ఉపాధి అవకాశాలను పెంచడానికి పలు ఐటి, ఔషధ పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. కేంద్రప్రభుత్వ నూతన విద్యా విధానానికి అనుగుణంగా యుజి స్థాయిలో విద్యార్థులను పరిశోధనలకు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బోధనతో పాటు పరిశోధనలకు గీతం సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గీతం ఇంజినీరింగ్, ఫార్మశీ, సైన్స్, మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రత్యేకించి కెరీర్ గైడెన్స్ విభాగాలు పనిచేస్తున్నాయని వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు మాట్లాడుతూ, మేనేజ్‌మెంట్ కోర్సులలో కేస్ స్టడీస్ ఆధారంగా విద్యార్థులకు బోధన చేస్తున్నామన్నారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సహకారంతో విద్యార్థులకు ఆర్థిక అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి మాట్లాడుతూ, సీనియర్ ప్రొఫెసర్ల పర్యవేక్షణలో డిగ్రీ కోర్సులను బోధిస్తున్నట్లు చెప్పారు. గీతం అకడమిక్ ఎఫైర్స్ డీన్ ప్రొఫెసర్ రాధిక, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ విభూతి సత్యదేవ్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, కంప్యూటర్ సైన్స్ డీన్ డాక్టర్ అరుణ్‌కుమార్, స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, ఆయా విభాగాధిపతులు, సీనియర్ ప్రొఫెసర్లు గీతం కోర్సుల ప్రత్యేకతలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

ఘాట్ రోడ్డులో తప్పిన పెను ప్రమాదం



అదుపు తప్పిన బస్సు

ప్రజాశక్తి- అనంతగిరి:అనంతగిరి ఘాట్ రోడ్డు లో బస్సు, బొలెరా ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం అనంతగిరి నుండి ఎస్ కోటకు వెళ్తున్న బొలెరా. విజయనగరం జిల్లా ఎస్.కోట ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు డమ్ము కు ఘాట్ రోడ్ సమీపంలో ఢీకొన్నాయి.ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదాలు జరగక పోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సు ఎడమవైపు ఉన్న రక్షణ గోడకు ఢీ కొట్టి ఆగింది. మరి కొంచెం ముందుకు వెళ్లి ఉన్నట్లయితే లోయలోకి దూసుకుపోయేది.

డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-జిమాడుగుల: మండలంలో పాలలమామిడి పంచాయతీ వననబంగిపాడు, వి కొత్తూరు, ఏడు వాళ్ళు, కొక్కిరపల్లి (కాలనీ,) లక్కుళ్ళు గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ సురబంగి రామకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో, వైస్ సర్పంచ్, కే.రామస్వామి, ఎంపీటీసీ, జి. అప్పారావు, వార్డు మెంబర్ కాసులమ్మ, వైసిపి సీనియర్ నాయకులు, యు.గణపతి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు, ప్రశాంత్ పాల్గొన్నారు.



విద్యార్థిని దత్తత తీసుకున్న ఉపాధ్యాయుడు

ఉదారత చాటుకున్న వెంకటరమణ

ప్రజాశక్తి- చింతపల్లి:చింతపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర-1 పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి పాంగి విష్ణు తల్లిదండ్రులు చిన్నతనంలోనే మృతి చెందడంతో అనాథగా మిగిలాడు. విష్ణు పరిస్థితిని గమనించిన తెలుగు ఉపాధ్యాయుడు ధారకాని వెంకటరమణ విష్ణును దత్తత తీసుకొని, పూర్తిస్థాయిలో చదివించేందుకు ముందుకొచ్చారు. వెంకటరమణ ఉదారతను గుర్తించిన ప్రధానోపాధ్యాయుడు సాగిన రామరాజు పడాల్, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

తహశీల్దార్‌ను కలిసిన జిసిసి బ్రాంచి మేనేజర్

ప్రజాశక్తి -జి మాడుగుల: మండల కేంద్రంలో నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గిడ్డి రాజ్ కుమార్‌ను నూతన జిసిసి బ్రాంచి మేనేజర్ జి.బాబురావు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అరకు కాఫీ అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, డిఆర్ డిపో నుంచి అన్ని సరకులు అందుబాటులో ఉంచాలని నాయ్యమైన సరుకులు పంపిణీ చేయాలని కొరారు ఈ కార్యక్రమంలో జి.మాడుగుల సెల్స్ మెన్ గండేరు నిరీక్షణరావు, సుబ్బారావు, విక్రమ్ పాల్గొన్నారు

గ్రామాల్లో చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి జికే వీధి : మండలంలో దుచ్చరపాలెం గ్రామాలలో తడి పొడి చెత్త కొరకు రింతాడ సర్పంచ్ బొబ్బిలి లక్ష్మి,పంచాయితీ కార్యదర్శి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో డస్ట్ బిన్ లు గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాగిన పుష్పకుమారి వైస్ సర్పంచ్ మడపల సోమేష్,వార్డ్ మెంబర్ జోగి పడాల్, పీసా కమిటీ అధ్యక్షులు భీమేశ్వర పడాలి రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.



దోమల మందు పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - విఆర్‌పురం: మండలంలోని రేఖపల్లి పిహెచ్‌సి పరిధిలో డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రెండో విడత దోమల మందు (ఎసిఎం 5శాతం) సోమవారం పిచికారి చేశారు. పెదమట్టపల్లి సెక్షన్ లో సర్పంచ్ వెట్టి లక్ష్మి పాల్గొన్నారు. నూతిగూడెంలో పిచికారి చేశారు. ముందు జాగ్రత్త చర్యగా దోమలమందు పిచికారి చేయించామని సర్పంచ్ తెలిపారు. పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాథ్

కుటుంబ అభివృద్ధిలో కీలక పాత్ర మహిళదే

ప్రజాశక్తి - మారేడుమిల్లి : మహిళా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. సోమవారం స్థానిక రైతు సమృద్ధి కేంద్రంలో ఏర్పాటు చేసిన మండల మహిళా సమైక్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి గ్రూపులు నిర్వీర్యం కాకుండా చూసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు గ్రూపు సభ్యులు అందరు బ్యాంకు లింకేజీ సదుపాయం ఉపయోగించుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలు స్వీకరిస్తున్న పిఒ

ప్రజాశక్తి-రంపచోడవరం: వ్యక్తిగతానికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజాసమస్యల పరిష్కార వేదికనిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ పాల్గొన్నారు. ఈ వారం 83 అర్జీలు రావడం జరిగిందని వారు తెలిపారు.

నిర్వాసిత భూములు సర్వే చేసి చూపాలి

ప్రజాశక్తి - విఆర్‌పురం: నిర్వాసితుల భూములు సర్వే చేసి చూపాలని అందాల సీతారాంరెడ్డి, వేట్ల ముత్యాలరెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. బుట్టాయిగూడెం, రామన్నగూడెం పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ పునరావాస కాలనీ నిర్వాసితుల కాలనీలకు వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకూ వారి సమస్య తీర్చటానికి వచ్చిన నాధుడే లేడన్నారు. నాన్‌ట్రైబల్, ట్రైబల్ భూములు కలిసి ఉండటం వలన తమ భూమి పరిధిలో వేసిన సర్వే రాళ్లను, నాన్ ట్రైబల్స్ రైతులు పీకేస్తున్నారని అడిగితే మీ భూమి అయితే సర్వే చేయించుకొండని తెలిపారన్నారు. సర్వే చేసి సర్వేరాళ్లు వేయాలని రెవిన్యూ అధికారులను కోరినా ఫలితం లేకపోయిందని ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వే చేయించాలని వారు కోరుతున్నారు.

కోరుకున్న చోట పునరావాసం కల్పించాలి

ప్రజాశక్తి - విఆర్.పురం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కోరుకున్న చోట పునరావాసం కల్పించాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, ఆర్‌టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ వడ్డీగూడెం, విఆర్.పురం, వడ్డీగూడెంకాలనీ, విఆర్.పురం బిసికాలనీ రాజుపేట, గుండుగూడెం, తదితర గ్రామాల్లో ఉన్న గిరిజనేతర నిర్వాసితులు గోకవరం పరిసర ప్రాంతాలైన కోరుకొండ, కొత్తపల్లి, జగన్నాథపురం గిరిజనులకు తాంటికొండ, జడ్డంగి గ్రామాల్లో ఇంటి స్థలాలు చూపారని ఆ ప్రాంత స్థానిక రైతులు భూములు ఇచ్చుటకు ఒప్పుకొని చింతూరు ఐటిడిఎ పిఒను కలసి భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ కూడా చూపటం జరిగిందన్నారు. పునరావాస కాలనీలు ఇచ్చే విషయంలో మెజారిటీ నిర్వాసితులు కోరుకునే చోట ఇంటి స్థలాలు ఇవ్వాలని, జిల్లా అధికారులను కోరారు. భూ సేకరణ చట్టం 2013 ప్రకారం నిర్వాసితులు కోరుకున్న



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు

చోట పునరావాసం ఇవ్వాలని స్పష్టంగా ఉందన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగేవరకూ పోరాడతామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, మాజీ మండల కన్వీనర్ పొడియం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం

ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు.సోమవారం జడ్డంగిలోని బహుళ ప్రయోజన సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన సౌకర్య గోదాంను ఆమె ప్రారంభించారు. ఫెర్టిలైజర్ అమ్మకాలు ప్రారంభించారు. అనంతరం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సంబంధించిన కరపత్రాలతో గ్రామంలో ఇంటింటా తిరిగి పథకాలు ప్రజలకు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ లోతా లక్ష్మణరావు, టిడిపి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు,ముప్పన్న డింభకేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావ్, సొసైటీ సిబ్బంది గోపాలష్ణ,టిడిపి నేతలు వాసంశెట్టి గంగాధర్,కాళ్లకూరి సత్యసుందరరావు, కంఠపురెడ్డి వీరబాబు,చెక్కా పండుబాబు,గట్టి మాణిక్యం,చవలా కుమార్ బాబు,ముప్పన మోహన్,కూటమి నాయకులు,మహిళలు పాల్గొన్నారు.



గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

చెన్నయ్యపాలెం గ్రామ సమస్యలు పరిష్కరించండి

మండలం జడ్డంగి పంచాయతీ చిన్నయ్యపాలెం శివారు శ్రీనుపేట గ్రామస్తులు ఎమ్మెల్యే మిరియాల శిరిషదేవిని కలిసి తమ గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరారు. చిన్నయ్యపాలెం నుండి శ్రీనుపేటకు 3కి.మీ రహదారి నిర్మించాలని,విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు. టిడిపి నాయకులు గణజాల తాతారావ్,టిడిపి నాయకులు వాసంశెట్టి గంగాధర్,కంఠపురెడ్డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న తోటల్లో కలుపు మొక్కలు తొలగించాలి

ప్రజాశక్తి-చింతపల్లి:మొక్కజొన్న పంటలో ఉత్తమ దిగుబడి సాధించాలంటే రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని చింతపల్లి వ్యవసాయ శాఖ అధికారి మధుసూదనరావు తెలిపారు. సోమవారం మండలంలోని చౌడుపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక రైతుల పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కజొన్న పంట ఎదుగుదల దశలో ఎప్పటికప్పుడు కలుపు మొక్కలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా పంట ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. సీజన్‌కు అనుగుణంగా పంట నిర్వహణ చేస్తే, మంచి దిగుబడితోపాటు ఖర్చు తగ్గుతుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సద్ద పరమేశ్వరరావు, వ్యవసాయ శాఖ సిబ్బంది మోహన్ పాల్గొన్నారు.

పాఠశాలను పునరుద్ధరణ చేయాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:

అనంతగిరి మండలం మారుమూల టంగెళబంధ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను పునరుద్ధరణ చేయాలని టీడీపీ కివర్ల పంచాయితీ ప్రెసిడెంట్, ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులు జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, డిఈఓ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిసిసి ఛైర్మన్ స్పందిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారిను గ్రామాల్లో పాఠశాల కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా టిడిపి కివర్ల పంచాయతీ ప్రెసిడెంట్ దురియ నూకరాజు మాట్లాడుతూ, టంగెళబంధ గ్రామానికి 2014 సంవత్సరంలో మాబడి అనే పేరుతో పాఠశాల ఉండేదని, అది 2019 సంవత్సరంలో పాఠశాల తీసేసి గంగవరం మండల పరిషత్ పాఠశాలలో కలిపారని తెలిపారు. దీంతో రాకపోకలు చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.టంగెళ్ళబంధ నుండి గంగవరం 2 కిలో మీటర్లు దూరం ఉందన్నారు. మధ్యలో గెట్టదాటుకొని పిల్లలు పాఠశాలకు వెళ్ళవలసిన పరిస్థితి ఎదుర్కొంటుందన్నారు.టంగేళబంధ గ్రామంలో సుమారు 30 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పి అప్పలకొండ, పి వెంకట్రావు, పి.ఈశ్వరరావు, సత్యారావు, వెంకట్రావు,కొండన్న తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ విజయకు ఫిర్యాదు చేస్తున్న యూత్‌సభ్యులు

చేతి పంపులకు మోటార్ల బిగింపుపై ఫిర్యాదు

ప్రజాశక్తి -అడ్డతీగల: స్థానిక మండల కేంద్రంలో పంచాయతీలో గల చేతి పంపులను కొంతమంది తమ సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. మరికొంతమంది ఏకంగా వాటికి మోటార్లు కూడా బిగించి వాడుకుంటున్నారు. మండలానికి చెందిన బీర బాలయోగి యూత్ సభ్యులు కూటమి యువ నాయకులు కొందరు ఎంపిడిఒ విజయకు ఫిర్యాదు చేశారు. అడ్డతీగల దేవిసెంటర్‌లోని దేవి గుడి వద్ద ఎఎన్ఎం సబ్‌సెంటర్ వద్ద, అలాగే పాత ఎక్సైజ్‌స్టేషన్ సమీపంలో మరికొన్ని చోట్ల కూడా ప్రభుత్వ చేతిపంపులు ఉండేవి వాటిని కొంతమంది ఆక్రమించుకోవడమే కాకుండా వాటికి మోటార్లు బిగించి సొంత అవసరాల కోసం వాడుకుంటున్నారు. మెయిన్ రోడ్‌లో పెద్ద డ్రైనేజ్‌ను సైతం ఆక్రమించి వాటిపై నిర్మాణాలు చేసి వ్యాపారాలను సైతం సాగిస్తున్నారు. ఆక్రమణదారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఐటిడిఎ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కుంజాశ్రీను తదితరులు

పార్వతి మృతికి కారణమైన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటిడిఎ ముట్టడి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఈనెల 11వతేదీన వై.రామవరం మండలం జాజిగడ్డ గ్రామానికి చెందిన కాకూరి పార్వతి రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో మృతి చెందిన సంఘటనపై ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం రంపచోడవరం ఐటిడిఎను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ వైద్యులు తక్షణమే స్పందించి ఉంటే పార్వతి మృతి చెంది ఉండేది కాదన్నారు. పార్వతి ఆమె భర్త సహజ ప్రసవం జరిగే పరిస్థితి లేకుంటే ఆపరేషన్ చేయాలని బతిమిలాడినా ఆసుపత్రి సిబ్బంది పట్టించుకోలేదన్నారు. పార్వతికి పురిటి నొప్పులు ప్రారంభమైనప్పుడు అందుబాటులో వైద్యులు లేరని వైద్యులు వచ్చే సమయానికి ఆమె స్పృహ కోల్పోయిందని, అనంతరం పార్వతి మతి చెందిందని ఈ విషయాన్ని వెంటనే భర్త దుర్గాప్రసాద్‌కు వైద్యులు చెప్పలేదని ఫార్మాలిటీస్ అన్ని పూర్తి చేసి ఆయన సంతకం చేసిన తరువాత మృతదేహాన్ని అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వైద్యుల్ని సస్పెండ్ చేసి వారిపై విచారణ జరపాలని ఐటీడీఏ పిఒ సింహాచలంకి ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. స్పందించిన పిఒ విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నరసాపురం మెటల్ క్వారీపై ఫిర్యాదు చేశారు. 15 రోజుల్లో నివేదిక అందజేయాలని పిఒ సబ్ కలెక్టర్‌కి ఆదేశాలు జారీ చేశారు. నాన్ ట్రైబల్స్ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని సబ్‌కలెక్టర్‌కి ఆదేశాలు జారీ చేశారని సంక్షేమ పరిషత్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్తు జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు, ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు మోడిగ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.